
పోలింగ్ ఏర్పాట్ల పరిశీలన

వీరఘట్టం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ఏర్పాట్లను సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఈ నెల 27న పోలింగ్ జరగనున్న దృష్ట్యా మంగళవారం వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కాలేజీని సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి.. తహసీల్దార్ సత్యనారాయణ, ఇతర అధికారులకు పలు సూచనలు చేశారు. లోపాలు తలెత్తకుండా చూడాలన్నారు. అనంతరం వీరఘట్టం పీహెచ్‌సీలో లేబర్‌రూం, మందుల గది, వ్యాక్సిన్ రూమ్‌లను పరిశీలించారు. ఆర్ఐ లక్ష్మణనాయుడు, డాక్టర్ ఉమామహేశ్వరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శివార్చనకు వేళాయే..



పారమ్మతల్లి వెలసిన పారమ్మకొండ



పాండవుల గుహ వద్ద శివలింగం ఇలా..

- నేడు మహా శివరాత్రి
- ముస్తాబైన శైవ క్షేత్రాలు
- ప్రత్యేక పూజలకు భక్తులు సన్నద్ధం

శివార్చనకు వేళయ్యింది. బుధవారం మహా శివరాత్రి పర్వదినాన్ని జరుపుకునేందుకు జిల్లావాసులు సన్నద్ధమయ్యారు. ఉపవాస దీక్ష, జాగరణకు సమాయత్తమయ్యారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేశారు. వేకువ జామునే శైవ క్షేత్రాలకు వెళ్లి భక్తిశ్రద్ధలతో ముక్కంటిని కొలిచేందుకు సర్వం సిద్ధం చేశారు. మరోవైపు జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రాలు, గుహాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. విద్యుద్దీపాలంకరణలో శోభాయమానంగా కనిపిస్తున్నాయి. భక్తుల రద్దీ దృష్ట్యా అధికారులు, కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లు, షామియానాలు, బారికేడ్లు తదితర వాటిని సిద్ధం చేశారు. శివరాత్రి సందర్భంగా జిల్లాలో పలుచోట్ల జాతరలు కూడా నిర్వహించనున్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

(పూర్తి వివరాలు ఆరో పేజీలో..)



హడలెత్తిస్తున్నాయ్

- పెదమేరంగిలో గజరాజుల బీభత్సం
- ఏడోసారి మిల్లుపై దాడి



మొక్కజొన్న తోటలో సంచరిస్తున్న ఏనుగులు

జియ్యమ్మవలస, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పెదమేరంగి కూడలి సమీపంలో గజరాజులు బీభత్సం సృష్టించాయి. సోమవారం అర్ధరాత్రి ఆ ప్రాంతంలో ఉన్న మినీ మోడ్రన్ రైస్ మిల్లులో రెండు షట్టర్లు , ఇనుప తలుపులను ధ్వంసం చేశాయి. లోపల ఉన్న రెండు క్వింటాళ్ల బియ్యం, క్వింటా నూకలు, ధాన్యం బస్తాలను చెల్లా చెదురుగా పడేశాయి. దీంతో మిల్లు యజమాని దాసరి అజాద్‌కుమార్ లబోదిబోమంటున్నారు. తన మిల్లుపై ఏనుగులు దాడి చేయడం ఏడోసారి అని, ఇప్పటివరకు అధికారులు తనకు నష్టపరిహారం అందించలేదని వాపోయారు. కాగా మంగళవారం ఏనుగులు గ్రామ సమీపంలోని మొక్కజొన్న చేలల్లో తిష్ఠ వేశాయి. దీంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ ఉన్నతాధికారులు స్పందించి గజరాజల తరలింపునకు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



మిల్లు వద్ద చిందర వందరగా పడి ఉన్న బియ్యం, ధాన్యం

దుర్వాసన..పొగ!

- జిల్లా కేంద్రాన్ని వేధిస్తున్న డంపింగ్ యార్డు సమస్య
- ప్రభుత్వాలు మారుతున్నా తరలింపునకు కలగని మోక్షం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వాహనదారులు
- గోపసాగరం కలుషితం
- అధికారులకు విన్నవించినా చర్యలు శూన్యం
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

పార్వతీపురం టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం జిల్లా కేంద్ర వాసులను దీర్ఘకాలికంగా వేధిస్తున్న డంపింగ్‌యార్డు సమస్యకు పరిష్కారం లభించడం లేదు. ప్రభుత్వాలు.. అధికారులు మారుతున్నా.. తరలింపునకు మోక్షం కలగడం లేదు. దీంతో యార్డు సమీపంలో ఉన్న ప్రజలు, అంతర్రాష్ట్ర రహదారి మీదుగా రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా గోపసాగరం కూడా కలుషితమవడంతో రైతులు, మత్స్యకారులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. మరోవైపు ఏటా వేసవిలో డంపింగ్‌యార్డులో చెలరేగే మంటలు, పొగ వల్ల ఆ ప్రాంతవాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కొద్దిరోజుల కిందట యార్డులో ఎగిసిపడిన మంటలను అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. భవిష్యత్‌లో ఆయా కాలనీల్లో భూగర్భ జలాలు కలుషితం కాకముందే.. ప్రజలు రోగాల బారిన పడకముందే అధికారులు, ప్రజాప్రతినిధులు మేలుకోవాల్సి ఉంది. తక్షణమే యార్డు తరలింపునకు చర్యలు చేపట్టాల్సి ఉందనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

తరలింపునకు అడుగులు పడినా..

- కాంగ్రెస్ ప్రభుత్వ హయాం(2008)లో డంపింగ్ యార్డు తరలింపునకు అడుగులు పడ్డాయి. అప్పట్లో మున్సిపల్ పాలకవర్గం కూడా హుటాహుటిన తీర్మానం చేసింది. అదే ఏడాది పార్వతీపురం మండలం పిట్టల వలస సమీపంలో కొండ వద్ద ఎనిమిదెకరాల స్థలాన్ని రెవెన్యూ శాఖ సేకరించి మున్సిపల్ అధికారులకు అప్పగించింది. సుమారు రూ.10 లక్షలతో మరికి గ్రామం నుంచి అప్రోచ్ రహదారి పనులకు భూమి పూజ చేసేందుకు వెళ్లిన అప్పటి ఎమ్మెల్యే జయమణిని పలు గ్రామాల ప్రజలు అడ్డుకున్నారు. దీంతో డంపింగ్ యార్డు తరలింపునకు బ్రేక్ పడింది.
- 2014లో టీడీపీ ప్రభుత్వ హయంలో డంపింగ్ యార్డు తరలింపునకు చర్యలు చేపట్టారు. సంగం వలస పంచాయతీ రావికోన, బట్టి వలస గ్రామాల సమీపంలో ఐదెకరాల స్థలాన్ని ఎంపిక చేశారు. అయితే గిరిజన సంఘాలు, వామపక్షాలతో పాటు వైసీపీ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో పనులు ముందుకు సాగలేదు.
- 2019లో వైసీపీ ప్రభుత్వంలో గరుగుబిల్లి మండలం సుంకి, పార్వతీపురం మండలం విశ్వంభర పురం గ్రామాల సమీపంలో యార్డు ఏర్పాటుకు స్థలాలు చూసినప్పటికీ ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చింది. మరోవైపు ఆ పార్టీ నాయకుల్లో చిత్తశుద్ధి కొరవడడంతో యార్డు తరలింపు అనేది కాగితాలకే పరిమితమైంది.

రోజూ నరకమే..

- పార్వతీపురం శివారులో ఉన్న డంపింగ్ యార్డు నుంచి వెలువడే దుర్వాసన వల్ల అంతర్రాష్ట్ర రహదారిపై వాహనదారులు, ప్రయాణికులు రాకపోకలు సాగించలేకపోతున్నారు. అదేవిధంగా యార్డుకు సమీపంలో

(మిగతా 8వ పేజీలో...)



పార్వతీపురం శివారులో ఉన్న డంపింగ్ యార్డు



ఇటీవల యార్డులో చెలరేగిన మంటలు

సమర్థంగా పది పరీక్షలు

- ఆర్జేడీ విజయ భాస్కర్

బెలగాం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పదో తరగతి పరీక్షలను సమర్థంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారులను పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ బి.విజయభాస్కర్ ఆదేశించారు. మంగళవారం స్థానిక జీజే కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పరీక్ష కేంద్రాల్లో ఫర్నిచర్, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా తదితర మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలన్నారు. మొత్తంగా 67 కేంద్రాల్లో టెన్త్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రెగ్యులర్, ప్రైవేట్ విభాగంలో మొత్తంగా 10,455 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు. సీఎస్‌లు, డీవోలు, ఎంఈవోలు అలసత్వానికి తావివ్వకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఈవో ఎన్.తిరుపతి నాయుడు, డిప్యూటీ డీఈవోలు బి.రాజ్‌కుమార్, పి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



దేదీప్యమానంగా..

- 16 ఏళ్లుగా వెలుగుతున్న అఖండ జ్యోతి

సాలూరు రూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): సాలూరు పంచముఖేశ్వర స్వామి ఆలయంలో అఖండ జ్యోతి 16 ఏళ్లుగా దేదీప్యమానంగా వెలుగుతునే ఉంది. దీపం నమోస్తుతే అంటూ భక్తులు నిత్య పూజలు చేస్తున్నారు. ఆలయంలో సుబ్బ గురువు ఆధ్వర్యంలో 2009, జూలై 2న అఖండ జ్యోతిని వెలిగించారు. నాటి నుంచి నిర్విరామంగా దీపం వెలుగుతుంది. రోజు ఆలయానికి వచ్చే భక్తులు ఆ ప్రమిదలో నూనె వేసి పూజలు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను విజయవంతం చేయాలి

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పార్వతీపురం రూరల్/బెలగాం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను విజయవంతం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సెక్టోరియల్ అధికారులతో సమావేశమయ్యారు. ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో 15 పోలింగ్ కేంద్రాలకు 30 బ్యాలెట్ బాక్సులను సరఫరా చేస్తున్నామని, ఒక బాక్సును మాత్రమే వినియోగించాలని ఆయన సూచించారు. 26న ఉదయం ఆరు గంటల నుంచి కలెక్టరేట్‌లో పోలింగ్ మెటీరియల్ పంపిణీ జరుగుతుందన్నారు. వాటిని ఆయా పీవో, ఏపీవోల ద్వారా సంబంధిత పోలింగ్ కేంద్రాలకు పంపే బాధ్యత సెక్టోరియల్ అధికారులదేనని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్ట్ ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

జిల్లాలో రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించాలని కలెక్టర్‌ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన రహదారి భద్రత కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రాంతాల్లోని రద్దీ ప్రదేశాలు, కూడళ్లలో విద్యుత్ దీపాలు, ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వినియోగించేలా చూడాలని ఆదేశించారు. పాఠశాల, కళాశాల స్థాయిల్లో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు కావాలని సూచించారు. రహదారి భద్రత, మత్తు పదార్థాల నివారణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డ్రోన్ల వినియోగంతో సారా, మత్తు పదార్థాల తయారీని అడ్డుకోవచ్చని తెలిపారు. ఎస్పీ మాధవరెడ్డి, ఏఎస్పీ అంకిత్ సురానా, డీఎస్పీ ఎం.రాంబాబు , జేసీ శోభిక, సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాత్సవ, సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల గోడౌన్ పరిశీలన

పార్వతీపురం టౌన్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గోడౌన్లలో భద్రపరిచిన ఈవీఎంలను కలెక్టర్ పరిశీలించారు. భద్రతవిషయంలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గోడౌన్ల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.

పోలమాంబ జాతరకు పోటెత్తిన భక్తులు



6లో

కనులపండువగా చక్రతీర్థ స్నానాలు



6లో

జీడి పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ

బెలగాం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో జీడి పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. జీడి పరి శ్రమకు అవసరమైన సొసైటీ రిజిస్ట్రేషన్, ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్, కావాల్సిన వసతులను త్వరితగతిన ఏర్పాటు చేయాలన్నారు. వీడీవీకేలన్నీ 365 రోజులు పనిచేసే విధంగా వెలుగు సిబ్బందితో కలిసి ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ప్రస్తుతం చింతపండు, జీడి బాగా లభిస్తున్నందున ప్రతి మండలానికి ఇచ్చిన లక్ష్యాల మేరకు కొనుగోలు చేయాలని తెలిపారు. పసుపును కొనుగోలు చేసి పౌడర్‌గా మార్చి విక్రయించాలని ఆదేశించారు. జీడి పప్పు తయారీ కేంద్రానికి అవసర మైన జీడి పిక్కలను కొనుగోలు చేయాలన్నారు. పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ కరుణాకర్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాంబాబు, ట్రాన్స్‌కో ఎస్ఈ కె.చలపతి రావు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ కరుణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో శ్రీవాత్సవ

ఉమ్మడి జిల్లాలోని శివాలయాల్లో మహా శివరాత్రి పూజలకోసం నిర్వాహకులు, అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. బుధవారం తెల్లవారుజాము నుంచే పూజలు నిర్వహించనున్నారు. ఆర్టీసీ అధికారులు భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక బస్సులు నడప నున్నారు. ఈమేరకు రెండు జిల్లాల పోలీసులు యంత్రాంగాలు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశాయి.

శివ పూజకు వేళాయె

- మహాశివరాత్రికి ముస్తాబైన ఆలయాలు
- ప్రత్యేక బస్సులు నడపనున్న ఆర్టీసీ



జలపాతంలో స్నానాలు చేసి..శివుని దర్శించి

శృంగవరపుకోట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోటలోని పుణ్యగిరి శివాలయంలో బుధవారం తెల్లవారు జాము నుంచి గురువారం సాయంత్రం వరకు మహాశివరాత్రి జాతర జరగనుంది. రెండురోజులపాటు లక్ష ఐదు వేల మంది భక్తులు వరకు కొండెక్కుతారని అధికారులు అంచనా వేశారు. మహాశివరాత్రి జాగారం చేసే భక్తులు ఈ కొండపై ఉన్న ఉమా కోటిలింగేశ్వర స్వామి పాదాలను తాకి వచ్చే పుట్ట దార, దారగంగమ్మలోయ (జలపాతం)వద్ద స్నానాలు చేసి పరమ శివు డిని దర్శిం చుకుంటారు.ఇలా చేస్తే తెలిసోతెలియకో చేసినపాపాలు పోతాయని ఇక్కడి భక్తుల నమ్మకం. దీంతో మహాశివరాత్రి పురస్కరించుకుని బుధవారం కంటే గురువారమే అత్యధికంగా భక్తులు పుణ్యగిరి కొండకు చేరుకుంటారని అధికారులు చెబుతున్నారు. ఇందుకు అనుగుణంగా దేవదాయశాఖతోపాటు వివిధ శాఖల అధికారులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈకొండపైన దారగంగమ్మ లోయ (జలపాతం) ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. లోయలోకి వెళ్లేందుకు రెయిలింగ్ ఏర్పాటు చేశారు. భక్తుల కోసం క్యూలైన్ ఏర్పాటుచేయడంతోపాటు మెట్లమార్గం అభి వృద్ధిచేశారు.విద్యుత్ సదుపాయం కూడా కల్పించారు. ఇక్కడ నుంచి స్థానిక దేవిబొమ్మ కూడలి వరకు రోడ్డును విస్తరించారు. పంచా యతీపరిధిలోని విశాఖ-అరకు రోడ్డులో ఆక్రమణలు, రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన మట్టి తొలగించారు. విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, శ్రీకా కుళం జిల్లాలతో పాటు ఒడిశాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. ఈ నేపథ్యంలో ద్విచక్రవాహనాలను మాత్రమే పుణ్యగిరి రోడ్డులో అనుమతించ నున్నారు. కార్లు, ఆటోలు, ఇతర వాహనాల పార్కింగ్‌కు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ, మహాత్మాగాంధీ పార్కు, నందిత హోటల్ వెనక భాగంలోగల ఖాళీ స్థలం, మూతబడి ఉన్న రామకృష్ణ థియేటర్ ఆవరణను కేటా యించినట్లు ఇన్‌చార్జి తహ సీల్దార్ భరత్ కుమార్ తెలిపారు. దేవిబొమ్మ కూడలి నుంచి పుణ్యగిరికి రెండు రోజుల పాటు ఉదయం నాలుగు గంటల నుంచి 15 బస్సులు, సన్యాసియ్యపాలెం నకు మూడు బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ రమేష్ తెలిపారు.

300 మందితో బందోబస్తు

పుణ్యగిరి కొండపై ఏర్పాటు చేసిన సదుపాయాలను విజయనగరం ఎస్పీ వకుల్ జిందాల్ మంగళవారం పరిశీలించారు. సీఐ వి.నారాయణ మూర్తితో కలిసి మెట్ల మార్గం, దారగంగమ్మ లోయ, పుట్టదార స్నాన ఘట్టాల వద్ద అవాంచనీయ సంఘట నలు జరగకుండ చర్యలు తీసుకోవాలని సూచించారు. 300 మంది పోలీస్‌లను బందోబస్తుకోసం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. లక్ష మంది దాటి భక్తులు దర్శనా నికి వచ్చే అవకాశం ఉండడంతో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండ పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.



పుణ్యగిరి కొండపై ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

నదుల సంగమంలో ఆలయం



కొమరాడ: గుంప సోమేశ్వరుని ఆలయంలో శివలింగం

కొమరాడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జంఝావతి, నాగావళినదుల సంగమంలో వెలసిన గుంప సోమేశ్వరాలయం మహా శివరాత్రికి ముస్తాబయ్యింది. ద్వాపరయు గంలో బలరాముడు ప్రతిష్ఠించిన పంచ లింగాల్లో గుంపసోమేశ్వరాలయం ఒకటి. ఇక్కడ ఏటా శివరాత్రి నాడు జాతర నిర్వ హించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా ఒడి శా నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. రాత్రి భక్తులకోసం సాంస్కృ తికకార్యక్రమాలను ఏర్పాటుచేస్తారు. గుం ప జాతరను పురస్కరించుకుని పార్వతీపు రం ఆర్టీసీ డిపో నుంచి పది బస్సు లను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు.

● గరుగుబిల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్ర జ్యోతి): గిజబ శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించను న్నారు.గొట్టివలస, శివ్వాం, నాగూరు, రావి వలస, రావుపల్లి, ఉల్లిభద్రతో పాటు పలు గ్రామాల్లోనిఆలయాలు శివరాత్రికి సిద్ధమ య్యాయి.తిరువీధి మహోత్సవంతో పాటు రుద్రాభిషేకాలు నిర్వహించనున్నారు.

పారమ్మకొండకు ప్రత్యేక బస్సులు

సాలూరు రూరల్/పాచిపెంట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సాలూరు మండలం లోని మంచాడవలస గుహాలయంలో శివరాత్రి పురస్కరించుకుని గోకర్ణేశ్వర జాతర నిర్వహించనున్నారు. పారమ్మకొండపై పారమ్మతల్లి జాతరకు ఏర్పాట్లుచేశారు. పారమ్మకొండపైకి వెళ్లేందుకు రహదారిని కూడా నిర్మించారు. కొండ మార్గమధ్యంలో పాండవుల గుహ వద్ద శివలింగం, మహాదేవి ఆలయం, సుబ్రమణ్యేశ్వర, భువనేశ్వరి, శ్రీచక్రం తదితర ఆలయాల్లో దర్శనానికి ఏర్పాట్లుచేశారు. బుధవారం తెల్లవారుజాము నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుంది.

●పారమ్మకొండ వద్ద బుధవారం జరిగే జాతరకు దేవదాయశాఖ, సనాతన ధర్మ పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాట్లుచేశారు. సాలూరు పోస్టాఫీస్ జంక్షన్ నుంచి పారమ్మ కొండ వరకు 25 బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ సాలూరు డిపో మేనేజర్ భాస్కర రెడ్డి చెప్పారు. పారమ్మకొండ జాతరకు 150 మంది పోలీసులతో భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు సాలూరు రూరల్ సీఐ పి.రామకృష్ణ చెప్పారు. భద్రత ఏర్పాట్లను ఏఎస్పీ అంకిత మహావీర్ సురానా పర్యవేక్షించనున్నట్లు తెలిపారు.

● గురువునాయుడుపేట గుహాలయం, సాలూరులో 500 ఏళ్లనాటి పంచముఖే శ్వరాలయం, కాకుడువలస వద్ద గుమ్మలకొండ గుహ, కొట్టక్కి భీమలింగేశ్వరాలయం భక్తుల దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



పూజలకోసం సిద్ధంచేసిన పారమ్మకొండపై పారమ్మదేవి ఆలయం

తొమ్మిది రోజులపాటు జాతర

వంగర, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) మండలం లోని సంగాంలో గల త్రివేణి సంగంలో (వేగావ తి, నాగావళి, సువర్ణముఖి నదులు కలిసే చోట) గల సంగమేశ్వరాలయంలో బుధవారం నుంచి తొమ్మిది రోజుల పాటు జాతర, ప్రత్యేక పూజలు, ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. దర్శనాల సమయంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బారికేడ్లు ఏర్పాటుచేశారు. ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ శంకర్ తెలిపారు. సంధ్యాస్నానం అనంతరం ఆలయ ఆవరణలో భక్తులు దర్శనానికి ఆకాశజ్యోతి ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు చెప్పారు. ఆలయ ప్రాంగణంలో కేశ ఖండనశాల, విశ్రాంతి గది ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.



సంగమేశ్వరాలయానికి రంగులతో అలంకరించిన దృశ్యం

బలరాముడు ప్రతిష్ఠించినట్లు..

సంగమేశ్వరాలయాన్ని సాక్షాత్తు బలరాముడు ప్రతిష్ఠించినట్లు పురాణాలు చెబుతున్నాయి.నాగావళి నదీతీరంలో ఒడిశాలోని గుంప, వంగరలోని సం గాం, శ్రీకాకుళంలోని కల్లేపల్లితో పాటు శ్రీకాకుళం, శ్రీముఖలింగం ఆల యాలు ఏకకాలంలో దర్శించుకుంటే మహాపుణ్యం దక్కుతుందన్న నమ్మ కంతో భక్తులు ఎక్కువగా ఇక్కడకు వస్తుంటారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖతోపాటు ఒడిశాలోని పలు ప్రాతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఇక్కడకు వస్తుంటారు.

శ్రీరాముడ్ని దర్శించుకుంటే..

నెల్లిమర్ల, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి వారి దేవస్థానంలో బుధవారం నుంచి రెండు రోజుల పాటు శివరాత్రి జాతర జరగనుంది. ఏటా శివరాత్రి, ఆ మరుసటి రోజు జరిగే జాతరకు విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన వారితో పాటు ఒడిశాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. ప్రధానంగా రామాలయం ఉన్న రామతీర్థంలో శివరాత్రి జాతర జరగడం ఒకింత ఆశ్చర్యం కలిగించే విషయమైనా, దీనికి కూడా చారిత్రక కథనం ఉన్నట్లు పూర్వీకులు చెబుతుంటారు. రావణాసురుడ్ని సంహరించిన శివభ క్తుడైన శ్రీరాముడు శివరాత్రి నాడు ఉపవాసంతో శివుడ్ని పూజిస్తాడని కథనం. అందువల్ల శివరాత్రి నాడు శ్రీరాముడ్ని దర్శించుకుని పూజలుచేస్తే ముక్తి, మోక్షం లభిస్తాయని నమ్మకం. ఈ జాతరకు సుమారు లక్ష మంది వచ్చే అవకాశముందని ఆలయ వర్గాలు చెబుతున్నాయి. జాతరను పురస్క రించుకుని భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం కార్యనిర్వహ ణాధికారి వై.శ్రీనివాసరావ పర్యవేక్షణలో ఏర్పాట్లుపూర్తయ్యాయి. రామతీర్థా నికి ఆర్టీసీ అధికారులు విజయనగరం, శ్రీకాకుళం, పాలకొండ తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడిపేందుకు చర్యలుచేపట్టారు. రెండు రోజుల పాటు జరిగే శివరాత్రి జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘ టనలు జరుగకుండా పోలీసులు విజయనగరం డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో భోగాపురం రూరల్ సీఐ జి.రామకృష్ణ, నెల్లిమర్ల ఎస్ఐ గణేష్ ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.భక్తుల రద్దీని క్రమబద్ధీకరిం చేందుకు పోలీసులతో పాటు పలు కళాశాలలకు చెందిన ఎన్‌ఎస్ఎస్ వలంటీర్ల సేవలు వినియో గించుకోనున్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు మంచినీరు, మజ్జిగ, పులిహోర అందజేసేందుకు సిద్ధంచేశారు.

మత్స్యకారుల జాగరణ

విజయనగరం జిల్లా పరిధిలోని భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండలాలకు చెందిన మత్స్యకారులతోపాటు శ్రీకాకుళం జిల్లా పరిధి లోని రణస్థలం, లావేరు, తదితర మండలాలకు చెందిన మత్స్యకారులు ఈ జాతరకు వచ్చి అదే రోజు రాత్రి జాగరణ చేస్తారు. మరుసటి రోజు తి రిగి పుణ్యస్నానం ఆచరించి సీతారాముల దర్శనా నికి వెళ్తారు.జాతరకు గ్రామీణ ప్రాంతాల నుంచి ఎడ్లబండ్లపై ఇంటిల్లపాది రామతీర్థం వస్తారు. రాత్రికి ఇక్కడే జాగరణ చేసి మరుసటి రోజు మధ్యాహ్నం భోజనం తర్వాత తిరుగు ముఖం పట్టడం ఆనవాయితీగా వస్తోంది.



భక్తుల కోసం క్యూలైన్లు ఏర్పాటు చేసిన ఆలయ సిబ్బంది

పోలమాంబ జాతరకు పోటెత్తిన భక్తులు

మక్కువ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉత్త రాంధ్రుల ఆరాధ్య దైవం శంబర పోలమాంబ అమ్మవారి ఐదోవారం జాతరకు మంగళవారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. చదురుగుడి, వనంగుడి వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్లు కిటకిటలాడాయి. మహిళలు వనం గుడి వద్ద అమ్మవారిని దర్శించుకుని అక్కడ ఉన్న వేపచెట్టుకు పూజలు చేశారు. గోముఖి నదీ తీరంలో అమ్మవారికి తలనీలాలు, కోళ్ల, చీరలతో మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల కు అసౌకర్యం కలగకుండా జిల్లా దేవాదాయ శాఖ అధికారి ఎస్.రాజారావు, ఈవో సూర్య నారాయణ ఏర్పాట్లు చేశారు. సాలూరు రూర ల్ సీఐ రామకృష్ణ, మక్కువ ఎస్ఐ ఎం.వెంకట రమణమూర్తి బందోబస్తు నిర్వహించారు.



చదురుగుడిలో అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

కనుల పండువగా చక్రతీర్థ స్నానాలు

భామిని, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): భామినిలో చక్రతీర్థ స్నానాలు కనుల పండుగగా నిర్వహించారు. ఉమారామలింగేశ్వరస్వామి ఆల య ఏడో వార్షికోత్సవం, శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి చక్రతీర్థస్నానం వైభవంగా జరిగాయి. ఉత్సవమూర్తులను మేళతాళాలతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. శివపార్వతులు విగ్రహాలను చక్రతీర్థస్నానాలకు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య వీధుల్లో ఊరేగించి నదీతీరానికి తీసుకువెళ్లారు. ఆలయఅర్చకులు రోబి మహరణ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ఉత్సవ విగ్రహాలకు పుణ్య స్నానం చేశారు. అనంతరం స్వామి వార్లను పల్లకీలో మోసుకుని శివనా మస్మరణతో శివాలయానికి భక్తులు తీసుకొచ్చారు.



భామినిలోని వంశధార నదిలో శివపార్వతుల విగ్రహాలకు చక్రతీర్థ స్నానాలు నిర్వహిస్తున్న భక్తులు



కొమరాడ: శివరాంపురంలో రీసర్వేను పరిశీలిస్తున్న శ్యామ్‌ప్రసాద్

రీసర్వే పారదర్శకంగా నిర్వహించాలి

●పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

కొమరాడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రీసర్వే పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసా ద్ రెవెన్యూ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. పార్వతీపురం జిల్లాలోని కొమరాడ మండలం శివరాం పురం పైలెట్ గ్రామంగా ఎంపికచేసి నిర్వహిస్తున్న రీసర్వే ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ప్రైవేటు భూ ములతోపాటు గ్రామ సరిహద్దులు, నీటి వనరుల, పోరంబోకు భూములను కొలతలు వేసి ఖచ్చితమైన సరిహద్దులను ఏర్పాటు చేస్తారన్నారు. తద్వారా రైతు లకు, భూయజమానులకు శాశ్వత మేలు జరుగుతుం దని పేర్కొన్నారు. రీసర్వేలో తప్పులు దొర్లకుండా పక్కాగా నిర్వహించాలన్నారు. ఇప్పటివరకు ఎంత మేర సర్వే నిర్వహించారని తహసీల్దార్ కె.శివయ్యను ప్రశ్నించగా 216 ఎకరాలు పూర్తయిందని తెలిపారు. మరణించిన భూయజమా నుల వారసులకు మార్పు చేసేలా ఎఫ్ఎంసీ విచారణ పూర్తిచేసి మ్యూటేషన్లు పరిష్కరించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. రోడ్లు, రైల్వే ట్రాక్‌లకు కేటాయించిన భూముల్లో హద్దులు నిర్ణయించి రక్షణ కల్పించాల న్నారు. చెరువులు, వాగుల్లో ఆక్రమణలను తొలగిం చాలని సూచించారు.కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అశు తోష్ శ్రీవాస్తవ, ఎంపీడీవో మల్లికార్జునరావు, మండల సర్వేయర్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

పరివర్తన ప్రణాళికకు జిల్లా ఎంపిక

బెలగాం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యవ సాయ, గ్రామీణపరివర్తన ప్రణాళికకు పార్వతీపురం మన్యం జిల్లా ఎంపికైందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ప్రాథమిక రంగాల వృద్ధిపై అధికారులతో కలెక్టర్ కలెక్టరేట్‌లో సమీక్షించారు. నీతిఆయోగ్ జిల్లా వ్యవసాయ, గ్రామీణ పరివర్తన పేదరికాన్ని తగ్గించ డంలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ప్రతి గ్రామీణ కుటుంబం ఆరోగ్యం, శ్రేయస్సు కోసం గ్రామీణ ఆర్థిక వృద్ధికి మార్గాలను సృష్టిస్తుందన్నారు. రైతుల ఆదా యాలు,ఉత్పాదకత, ఉపాధిని పెంపొందించుందన్నా రు.జిల్లాలో నిమ్మగడ్డికి అనుకూల వాతావరణం ఉం దని,దానిపైదృష్టిసారించాలన్నారు. సమావేశంలోజిల్లా వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, పట్టు,పశు సంవర్థక శాఖల అధికారులు కె.రాబర్ట్‌పాల్,శ్యామల, వి.తిరుప తయ్య, సాల్మన్‌రాజు, ఎస్.మన్మథరావు పాల్గొన్నారు.



ట్రోఫీ అందుకుంటున్న విజయనగరం క్రీడాకారులు

బీపీఎల్ రన్నర్‌గా విజయనగరం కింగ్స్

బొబ్బిలి ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోని రాజా కళాశాల మైదానంలో మంగళవా రం నిర్వహించిన బొబ్బిలి పీమియర్‌లీగ్ (బీపీఎల్ 2-టి 20) ఫైనల్ క్రికెట్ పోటీల్లో విశాఖకు చెందిన మరిడిమాంబ వారియర్స్ విజేతగా, విజయనగరం కింగ్స్ జట్టు రన్నర్‌గా నిలిచా యి. బీపీఎల్ నిర్వాహకులు బొత్స అప్పలు, పి.గణేశ్, రమేష్, సందీప్, చిన్నల ఆధ్వర్యంలో ఈనెల ఎనిమిదో తేదీన ప్రారంభమైన ఈ పోటీల్లో ఉమ్మడిఉత్తరాంధ్ర జిల్లాలు, ఒడిశాలోని రాయగడ నుంచి మొత్తం 16కిపైగా జట్లు పాల్గొన్నాయి. విజేతలకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి, టీడీపీ నేతలు రాంబార్కి శరత్‌బాబు, బొత్స అప్పలు, అభ్యుద య విద్యాసంస్థల అధినేత చింతా శారద, మనోజ్‌కుమార్ బహుమతుల ప్రదానం చేశారు. విజేతగా నిలిచిన విశాఖ జట్టుకు రూ.75 వేలు, మెమోంటో, రన్నర్‌గా నిలిచిన విజయనగరం జట్టుకు రూ.35 వేలు,మెమోంటోను అందజేశారు.మ్యాన్ ఆఫద సిరీస్‌గా విశాఖ క్రీడాకారుడు వినయ్ ఎంపికయ్యారు.

'ఉపాధి'లో ప్రగతి చూపించండి

●గోకులాలు పూర్తి చేయకపోవడంపై విజయనగరం జిల్లా కలెక్టర్ అంబేడ్కర్ అసంతృప్తి

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న రోడ్లు, డ్రెయిన్లు, గోకులాల పనులు, వేతనాలు, పనిదినాలు కల్పనలో ప్రగతి కన్పించకపోతే సంబంధిత ఏఈలు, ఏపీవోలపై చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ అంబేడ్కర్ హెచ్చరించారు. మంగళవారం విజయనగరం కలెక్టరేట్ ఆడిటోరియంలో జాతీయ గ్రామీ ణ ఉపాధిహామీ పథకం పనులపై సమీక్షించారు.ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ మూడు విడతలుగా సుమారు రూ.184 కోట్ల విలువైన 2900 కన్వర్జెన్సీ పనులను మంజూరు చేయగా,1782 పనులు పూర్తి కాగా, మరికొన్ని పనులు ప్రగతిలో ఉన్నాయని తెలిపారు.ఇంకా ప్రారంభం కాని 261 పనులను వచ్చే సోమవారంలో ప్రారంభించాలని ఆదేశించారు. విజ యనగరం, గజపతినగరం, గరివిడి, గంట్యాడ,దత్తిరాజేరు, డెంకాడ, జామి, వేపాడ మండలాల్లో ప్రారంభం కాని పనులు ఎక్కువగా ఉన్నాయని చె ప్పారు. పనులు పూర్తి చేయడంలో భోగాపురం, విజయనగరం, డెంకాడ, గజపతినగరం, గంట్యాడ, గరివిడ, వంగర, బొండపల్లి, గుర్ల జామి మం డలాల్లో పని తీరు అధ్వానంగా ఉందని తెలిపారు. వారం రోజుల్లోగా ప్రతి మండలంలోని 50 శాతం పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఏపీవోలుపై కలెక్టరు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం చూపడంపై, 1016 గోకులాలను మంజూరు చేయగా, ఇంకా పూర్తి చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. సగటు వేతాన్ని రూ.250 పెంచాలని సూచించారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీని వాస్, డ్వామా పీడీ శారదదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్



మరమ్మతుకు గురైన పైప్‌లైన్

50 గ్రామాలకు తాగునీటి సరఫరా బ్రేక్

● నిలిచిన బొడ్డవలస రక్షిత పైలెట్ స్కీం ● ఎంఆర్‌పేట వద్ద పైప్‌లైన్‌కు మరమ్మతులు

● బుధవారం రాత్రికి నీటిసరఫరా పునరుద్ధరిస్తాం: ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

రేగిడి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బొడ్డవలస రక్షిత పైలెట్ ప్రాజెక్ట్ పైప్‌లైన్ మరమ్మతుకు గురైంది. దీంతో 50 గ్రామాలకు రెండు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. రేగిడి మండలంలోని 35 గ్రామాలు, రాజాం మండలంలో 15 గ్రామాలకు తాగునీరు సరఫరా కావడంలేదు. మజ్జిరాముని పేటలోని ప్రధాన పైప్‌లైన్ లీక్‌లను రెండు రోజులుగా మరమ్మతులు చేపడుతున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీచరణ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. బుధవారం రాత్రి తాగునీటి సరఫరా పునరుద్ధరిస్తామని ఏఈ చెప్పారు. అయితే రెండు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవటంతో 50 గ్రామాల వారు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. తక్షణమే తాగునీటి సరఫరా పునరుద్ధరించాలని వారు కోరారు.



పనులు చేస్తున్న సిబ్బంది

పైడితల్లమ్మకు పుష్పాలంకరణ



విజయనగరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉత్తరాంధ్ర ప్రజల కొంగుబంగారం పైడితల్లమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా పుష్పాలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.

నేటి నుంచి తాగునీటి సరఫరా

రాజాం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాజాం మున్సిపాలిటీలో బుధవారం నుంచి తాగునీటి యథావిధిగా సరఫరా చేయనున్నారు. అమ్మవారి గుడి సమీపంలోని ప్రధాన వాల్వ్‌తో పాటు పైప్‌లైన్ మరమ్మతుల వల్ల రెండురోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయిన విషయం తెలిసిందే. మరమ్మతులు దాదాపు పూర్తయ్యాయని బుధవారం నుండి తాగునీటిని 24 వార్డులకు యథావిధిగా సరఫరా చేస్తామని మున్సిపల్ ఏఈవెంకటరామరాజు తెలిపారు.

బకాయిలు చెల్లించండి

డెంకాడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఎరువుల బకాయిలను వెంటనే చెల్లించాలని విజయనగరం మార్క్‌ఫెడ్ డీఎం ఎస్.వెంకటేశ్వరరావు కోరారు. బుధవారం డెంకాడలోని రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల బకాయిలను చెల్లించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట మార్క్‌ఫెడ్ సిబ్బంది సుధీర్ ఉన్నారు.

క్రీడాకారిణికి ఆర్థిక సాయం

వేపాడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండగంగుబూడి గ్రామానికి చెందిన క్రీడాకారిణి గమ్మెల లక్ష్మికి అదే పంచాయతీకి చెందిన హెడ్ కానిస్టేబుల్ బొడ్డు రవి రూ.10 వేలు ఆర్థిక సాయం మంగళవారం అందజేశారు. లక్ష్మి లాంగ్ జంప్‌లో జాతీయ స్థాయిలో రాణించింది. నిరుపేద కుటుంబానికి చెందిన లక్ష్మి ప్రస్తుతం హైదరాబాద్‌లో శిక్షణ పొందుతోంది. ఆ విషయాన్ని తెలుసుకున్న హెచ్‌సీ ఆమెకు తనవంతు సాయం అందించారు.

అధిక ధరలకు విక్రయిస్తే కేసులు

విజయగనరం రింగురోడ్డు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సరుకులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టరు దామోదర్‌నాయుడు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలో పలు వ్యాపార సంస్థలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. 8 మందిపై కేసులు నమోదు చేశారు. తూనిక యంత్రానికి సీళ్లు లేకపోవడం గుర్తించి మూడు కేసులు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో టెక్నికల్ అసిస్టెంట్ సత్యనారాయణ ఉన్నారు.

క్రీడలకు 'శారదా' ప్రోత్సాహం

కొత్తవలస, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): క్రీడలను ప్రోత్సాహించడానికి మండలంలోని కంటకాపల్లిలోని శారదా కర్మాగారం చేస్తున్న కృషి ప్రశంసనీయమని కర్మాగారానికి చెందిన డిప్యూటీ ముఖ్య తనిఖీ అధికారి వి.సురేష్ అన్నారు. మంగళవారం కంటకాపల్లి జడ్పీ హైస్కూల్‌లో నిర్మాణం చేసిన షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ కోర్టులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ గల క్రీడాకారులను వెలికితీయడం కోసం ఇటీవల జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో కర్మాగార ప్రతినిధులు సన్యాశిరావు, సూర్యభాస్కర్, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా గాదెను గెలిపించండి

మెరకముడిదాం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఎమ్మెల్సీగా గాదె శ్రీనువాసుల నాయుడును గెలిపించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆల్తి రాంబాబు మంగళవారం పాఠశాలల్లో ప్రచారం చేశారు. అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

రఘువర్మ అభ్యర్థిత్వాన్ని బలపరచండి

● జగన్ తీరు బాధాకరం: ఎంపీ కలిశెట్టి



మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి

విజయనగరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి పార్టీలు బలపరిచిన రఘువర్మ అభ్యర్థిత్వాన్ని బలపరిచి ఆయన గెలుపునకు నాయుకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ అధ్యక్షుడు కిమిడి నాగార్జునతో కలిసి ఆయన మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలు తొలిరోజున వైసీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జగన్ ప్రవర్తించిన తీరు బాధాకరమన్నారు. ప్రజలు ఇవ్వని ప్రతిపక్ష హోదా.. అసెంబ్లీలో ఎలా వస్తుందని ప్రశ్నించారు. జగన్ భ్రమల నుంచి బయటకు వచ్చి వాస్తవాలను గ్రహించాలన్నారు. అధికారంలోకి వద్దామన్న ఆలోచన పక్కన పెట్టి ప్రజా సమస్యలపై పోరాడాలన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు, పిల్లా విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లపై సమీక్ష



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో కీర్తి

నెల్లిమర్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో ఈ నెల 26న బుధవారం జరుగునున్న శివరాత్రి జాతర ఏర్పాట్లపై విజయనగరం ఆర్డీవో దాట్ల కీర్తి మంగళవారం మధ్యాహ్నం రామతీర్థంలో సమీక్ష నిర్వహించారు. ఆలయాన్ని సందర్శించి జాతర ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. దేవస్థానం అధికారులు, పోలీస్ అధికారులతో మాట్లాడారు. ఏర్పాట్లుపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్యూలైన్‌లు, బారికేడ్లు ఏర్పాట్లతో పాటు భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు బి.సుదర్శనరావు, దేవస్థానం ఈవో వై.శ్రీనివాసరావు, నగర పంచాయితీ కమిషనర్ కె.అప్పలరాజు ఉన్నారు.



ఆలయ ప్రాంగణంలో ఏసీ శిరీష

● చీపురుపల్లి: వచ్చేనెల 2 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరకు సంబంధించిన ఏర్పాట్లను మంగళవారం దేవాదాయశాఖ సహాయ కమిషనర్ కె.శిరీష పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న బారికేడ్లు, భక్తులకు ఎండ తగలకుండా వేస్తున్న పందిళ్లను చూశారు. అనంతరం అమ్మవారిని ఆమె దర్శించుకున్నారు. ఆమె వెంట ఆలయ ఈవో బి.శ్రీనివాస్ ఉన్నారు.

వచ్చే ఏడాది బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్



క్రీడాకారుడిని అభినందిస్తున్న ఎమ్మెల్సీ

శృంగవరపుకోట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మాస్టర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించేందుకు ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అంగీకరించిందని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. విజయవాడ క్లబ్‌లో ఈనెల 21 నుంచి 25 వరకు నిర్వహించిన మాస్టర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న క్రీడాకారుడిని మంగళవారం ఆయన అభినందించారు. 75 ఏళ్ల వయస్సులో క్రీడల్లో పాల్గొనడం గొప్ప విషయం అన్నారు.

చికెన్, గుడ్లు ఉచితంగా..



వండిన చికెన్, గుడ్లు పంపిణీ

శృంగవరపుకోట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): చికెన్ తినండంటూ శృంగవరపుకోట దేవిబొమ్మ కూడలిలో మంగళవారం సాయంత్రం వెంకటేశ్వర హేచరీస్, వెన్‌కోబ్ చికెన్ యాజమాన్యాలు ప్రజలకు అవగాహన కల్పించారు. చికెన్, ఉడికించిన గుడ్లను ఉచితంగా పంపిణీ చేసారు. జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేదని, ఎటువంటి వ్యాధి రాదని ప్రొడక్షన్ మేనేజర్ రవికుమార్, జిల్లా సేల్స్ అండ్ మార్కెటింగ్ మేనేజర్ సంతోష్‌కుమార్ ప్రజలకు అవగాహన కల్పించారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ

శృంగవరపుకోట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని మంగళవారం ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు. ఎన్నిక సజావుగా, ప్రశాంతంగా జరిగేలా బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పోలింగ్ కేంద్రానికి చుట్టుపక్కల గుంపులుగా ఉండకుండా చూడాలన్నారు. ఓటు హక్కు లేని వారిని, అనధికార వ్యక్తులు, వాహనాలను పోలింగ్ కేంద్రం పరిసరాల్లోకి అనుమతించవద్దన్నారు. డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, సీఐ వి.నారాయణమూర్తి, ఎస్బీ సీఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కె.చౌదరి, ఎస్ఐలు గంగరాజు, శ్రీనివాసరావు ఉన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు

● రాజాం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దారు ఎస్.కృష్ణంరాజు, సీఐ కె.అశోక్‌కుమార్, ఎన్నికల డీటీ ప్రకాశ్ తదితరులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని 594 ఓటర్లు ఉండగా.. అందులో పురుషులు 436 మంది, మహిళలు 158 మంది ఉన్నారన్నారు. పోలింగ్ రోజు 27న పోలింగ్ కేంద్రం వద్ద 144వ సెక్షన్ అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వై.దుర్గారావు. ఆర్ఐ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించండి



మాట్లాడుతున్న డీఎస్పీ రాఘవులు

వంగర, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా త్రివేణి సంగమమంతో పుణ్యస్నానాలు, సంగమేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తుల కోసం సౌకర్యాలు కల్పించాలని చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు, దేవాదాయశాఖ ఏసీ శిరీష అన్నారు. మంగళవారం సంగమేశ్వరస్వామి ఆలయంలో డీఎస్పీ ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సమావేశం నిర్వహించారు. త్రివేణి సంగమ ప్రాంతంలో ప్రత్యేక నిఘా ఉంచాలని పలువురు డీఎస్పీని కోరారు. తాగునీరు, మజ్జిగ ఏర్పాటుకు పలు స్వచ్ఛంద సంస్థలు, నీలానగరానికి చెందిన ఓ వ్యక్తి అన్నదానం చేయటానికి ముందుకు వచ్చారన్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ ఉపేంద్ర, ఎస్ఐ షేక్‌శంకర్ తదితరులున్నారు.

కూరగాయల కొనుగోలుకు ఏర్పాట్లు



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారి

శృంగవరపుకోట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన కూరగాయలను కొనేందుకు రైతు బజార్లు ముందుకు వచ్చాయి. రైతు బజార్లులో విక్రయిస్తున్న కూరగాయల ధరల కంటే 25 శాతం తక్కువగా కొనుగోలు చేయాలని ఉద్యానవన, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు నిర్ణయించాయి. ఇందులో భాగంగా జిల్లా అధికారులు జమదగ్ని, బి.రవికుమార్ సూచనల మేరకు మంగళవారం శృంగవరపుకోట రైతు బజారు ఎస్టేట్ అధికారి కె.సంతోష్ సంతగైరమ్మపేట గ్రామానికి చెందిన రైతులకు అవగాహన కల్పించారు. టమాటా, వంగ పంటలను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. బహిరంగ మార్కెట్‌లో తక్కువ ధరకు కూరగాయలను అమ్ముకుని నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారి టి.అనిత, ఏవో రవీంద్ర తదితరులున్నారు.

బడ్జెట్‌పై అవగాహన సదస్సు

శృంగవరపుకోట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట శాఖా గ్రంథాలయంలో మంగళవారం ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న బడ్జెట్‌పై ఓటరు అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకుడు దొడ్డి సూర్యారావు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి ఓటరు బడ్జెట్ కోసం తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠకులు, గ్రంథాలయ అధికారి డి.శ్రీధర్ ఉన్నారు.

ఎమ్మెల్సీగా రఘువర్మను గెలిపించండి



సోంపురంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి



శివరాంలో రామ్‌మల్లిక్‌నాయుడు..

వేపాడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పాకలపాటి రఘువర్మను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పిలుపు నిచ్చారు. మండలంలోని సోంపురం, బొద్దాం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జీసీసీ డైరెక్టర్ దాసరి లక్ష్మి, టీడీపీ నాయకులు కొట్యాడ రమణమూర్తి, పోతల వెంకటరమణ, జనసేన నాయకుడు మళ్ల వెంకటరమణ తదితరులున్నారు.

గరివిడి/ మెరకముడిదాం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పాకలపాటి రఘువర్మను గెలించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు పిలుపునిచ్చారు. మండలంలో శివరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన మంగళవారం ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పైల బలరాం, సారిపాక సురేష్‌కుమార్, వెంపడాపు రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో అంబేడ్కర్ జంక్షన్

● నెలరోజులుగా వెలగని లైట్లు



పెట్రోల్‌బంక్ సమీపంలో అంధకారం

రాజాం రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేడ్కర్ జంక్షన్‌లో అంధకారం రాజ్యమేలుతోంది. సెంటర్ లైటింగ్ కాకుండా ఆరేసి లైట్లతో ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఒకటి, పెట్రోల్ బంక్‌ను ఆనుకుని మరొక స్థంబానికి అమర్చిన 12 లైట్లు నెలరోజులుగా వెలగడం లేదు. దీంతో రాకపోకలు సాగించే వారంతా అవస్థలకు గురవుతున్నారు. ఇదిలా ఉంటే పశువుల సంచారం కూడా ఎక్కువగా ఉండడంతో చిన్నపాటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మరమ్మతులకు గురైన లైట్ల స్థానంలో కొత్తగా లైట్లు అమర్చాలని ప్రాంతీయులు కోరుతున్నారు.

నాన్నా.. నీకు నేనున్నా..

● అంధుడైన తండ్రికి చిన్నారి తోడుగా..



తండ్రికి దారి చూపుతూ తనయ

రాజాం రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి)! పుట్టుకతో అంధుడైన తండ్రి చేతిని తన చేతిలో పెట్టుకుని ముందుకు తీసుకువెళ్తున్న ఈ నాలుగేళ్ల చిన్నారి పేరు మేఘన. దివ్యాంగులతో కలిసి పట్టణాలలో పాటలు పాడుతూ దాతలిచ్చే సాయంతో కుటుంబాన్ని నరిసింగరావు పోషిస్తుం టారు. ఈనెల 24న రాజాం మెయిన్ రోడ్‌లో రాత్రి పొద్దుపోయే వరకూ పాటలు పాడి తోటివారితో కలిసి అక్కడే బస చేశాడు. ఇతనిది రాజాం మండలం బొద్దాం కావడంతో అక్కడికి వెళ్లేందుకు మంగళవారం కూతురు మేఘన సాయంతో ఆటో కోసం వెళ్తూ కనిపించారు. తన భార్య అందుబాటులో లేకుంటే కూతురే ముందుండి దారి చూపుతుందని నరిసింగరావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

క్రైంన్యూస్

భోగాపురం, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): పూసపాటిరేగ మండలం చింతపల్లికి చెందిన కిలాన ఎరకారావు (33) లింగాలవలస సమీపంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారని ఎస్ఐ పి.సూర్యకుమారి తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. చింతపల్లికి చెందిన ఎరకారావు విశాఖలో వంట పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతడి భార్య, పిల్లలు లింగాలవలస సమీపంలో నివాసం ఉంటున్నారు. అయితే ఇటీవల ఇల్లు నిర్మాణం చేపట్టడంతో ఎరకారావు అప్పులపాలయ్యాడు. అప్పులు ఇచ్చిన వారు ఒత్తిడి చేయడంతో మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం లింగాలవలస మద్యం దుకాణం సమీపానికి వచ్చి నేను చనిపోతున్నానని భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. దాంతో భార్య బంధువులతో కలిసి మద్యం దుకాణం సమీపానికి వచ్చి చూడగా అపస్మారక స్థితిలో ఉన్నారన్నారు. ఎరకారావును చికిత్స నిమిత్తం సుందరపేట సామాజిక ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా మారడంతో విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి ఎరకారావు చెందారన్నారు. మృతుడికి తల్లిదండ్రులు, భార్య దుర్గ, పిల్లలు వీరేంద్ర, అవంతిక ఉన్నారు. దీనిపై మృతుడు భార్య కిలాన దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ సూర్యకుమారి తెలిపారు.

గాయపడిన వ్యక్తి..

రామభద్రపురం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): బూసాయవలస గ్రామం వద్ద సోమవారం ఆర్టీసీ బస్సు ఢీకొని గాయపడిన మడక కృష్ణ(65) చికిత్స పొందుతూ బాడంగి ప్రభుత్వ ఆసుపత్రిలో అదేరోజు రాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో రోడ్డు దాటుతున్న కృష్ణను విజయనగరం నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్రగాయాలు కావడంతో బాడంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి 11 గంటల సమయంలో మృతిచెందాడు. ఎస్ఐ వెలమల ప్రసాద్ కేసు నమోదు చేశారు.

పోక్సో కేసులో వ్యక్తికి 20 ఏళ్ల జైలు

దత్తిరాజేరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో వ్యక్తికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.4 వేలు జరిమానా విధిస్తూ పోక్సో ప్రత్యేక న్యాయాధికారి నాగమణి తీర్పు వెల్లడించారని ఎస్పీ వకుల్ జిందాల్ ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలిక గజపతినగరంలో ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతోందన్నారు. బస్ పాస్ కోసం 2023 జూన్ 29న వెళ్లిన బాలిక ఇంటికి తిరిగి రాకపోవడంతో బాలిక అదృశ్యమైనట్టు తల్లి ఫిర్యాదు మేరకు పెదమానాపురం పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. మారోజు వెంకటేష్ ఆ గ్రామంలో ట్యూషన్ చెప్పేవాడని, ట్యూషన్‌కు వెళ్లే సమయంలో బాలికతో పరిచయం పెంచుకున్న అతడు పెళ్లి చేసుకుంటానని నమ్మించి వేరే ప్రాంతానికి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడన్నారు. బాలిక తెలిపిన వివరాలతో పెదమానాపురం పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారన్నారు. అప్పటి డీఎస్పీ పి.శ్రీనివాసరావు దర్యాప్తు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారన్నారు. తెలిపారు. నేరం రుజువు కావడంతో న్యాయాధికారి శిక్ష ఖరారు చేశారని ఎస్పీ వివరించారు.

గడ్డివాము దగ్ధం

కొత్తవలస, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిమ్మలపాలెంలో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో బొబ్బర రాజుకు చెందిన గడ్డి వాము దగ్ధమైందని కొత్తవలస అగ్నిమాపక కేంద్రం అధికారి వై.అశోక్‌కుమార్ తెలిపారు. ప్రమాదంలో సుమారు రూ.10 వేల ఆస్తి నష్టం జరిగిందన్నారు.

నిబంధనల ఉల్లంఘనపై టీచర్లకు నోటీసులు

గుర్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘనపై స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రసాదరావు, కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌కు ఎన్నికల అధికారులు మంగళవారం నోటీసులు అందజేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా రెండు రోజుల కిందట ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు గుర్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అందులో భాగంగా తమ అభ్యర్థికి ఓటు వేయాలని ఉపాధ్యాయులను కోరారు. ఇదే సందర్భంలో స్థానిక హెచ్‌ఎం గది, ప్రిన్సిపాల్ గదిలో కూర్చొని ప్రచారం చేశారని ఎన్నికల అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో మండల ఎన్నికల అధికారి వీటిపై సమగ్ర విచారణ చేసి నివేదిక పంపాలని కోరారు. అందులో భాగంగా సోమవారం తహసీల్దార్ ఆదిలక్ష్మి వివరాలు సేకరించారు. స్థానిక ఎంపీడీవో శేషు, తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఎంఈవోలు భానుప్రకాశ్, మజ్జి శ్రీనివాసరావు విచారణ చేశారు. దాంతో హెచ్‌ఎం ప్రసాదరావు, ప్రిన్సిపాల్ సురేష్‌లకు నోటీసులు అందజేశారు.

జాతర దృష్ట్యా ట్రాఫిక్ మళ్లింపు

నెల్లిమర్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో బుధవారం నుంచి మహాశివరాత్రి జాతర నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టనున్నామని ఎస్ఐ బి.గణేష్ తెలిపారు. రణస్థలం నుంచి విజయనగరం వెళ్లాల్సిన వారు రామతీర్థం ఊర్లో నుంచి కాకుండా బైపాస్ రోడ్డు చెరువు గట్టు మీదుగా వెళ్లాలని సూచించారు. రణస్థలం వైపు నుంచి దర్శనానికి వచ్చిన వారు తమ వాహనాలను నెలివాడ వద్ద ప్రకృతి లే-అవుట్‌లో పార్కింగ్ చేసుకోవాలన్నారు. నెల్లిమర్ల నుంచి సతివాడ వెళ్లాల్సిన వారు సీతారాముడిపేట జంక్షన్ నుంచి బైపాస్ చెరువు గట్టు రోడ్డులో వెళ్లాలన్నారు. రామతీర్థం నుంచి నెల్లిమర్ల, విజయనగరం వైపు వచ్చే ప్రయాణికులు పూడమ్మతల్లి ఆలయ మార్గంలో మిమ్స్ వద్దకు చేరుకుని మెయిన్‌రోడ్డులో కలవాలన్నారు. ఆర్టీసీ బస్సులు మినహా ఏ ఇతర వాహనాలను సీతారాముడిపేట జంక్షన్ నుంచి లోపలికి అనుమతించమని స్పష్టం చేశారు. భక్తులు ఈ విషయాలను గమనించి సహకరించాలని ఎస్ఐ కోరారు.

ఆగని చెట్ల నరికివేత

శృంగవరపుకోట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా చెట్లు నరికితే చట్టపరమైన చర్యలు తప్పవని తెలిసినా చెట్లను నరకడం ఆగడం లేదని శృంగవరపుకోట పట్టణానికి చెందిన పర్యావరణ వేత్త, న్యాయవాది బి.రామకృష్ణ ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పుణ్యగిరి రోడ్డులో చింత చెట్లును రెండు రోజులుగా అక్రమార్కులు తొలగిస్తున్నారన్నారు. వాల్టా చట్ట ప్రకారం చెట్లను తొలగించరాదని సంబంధిత వ్యక్తులకు వివరించినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు సైతం స్పందించడం లేదన్నారు. పర్యావరణానికి నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

రోడ్డుకు ప్రతిపాదనలు

కొత్తవలస, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస నుంచి విశాఖ జిల్లాకు కొత్తగా రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్టు తహసీల్దార్ బి.నీలకంఠరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వీఎంఆర్డీఏ విజన్ 2020-40లో భాగంగా కొత్తవలస మండలంలోని చింతలపాలెం రెవెన్యూ పరిధి నుంచి విశాఖ జిల్లా ఆనందపురం మండలం రామవరం మీదుగా గండిగుండం హైవేను కలుపుతూ కొత్త రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేశామన్నారు. చింతలపాలెం రెవెన్యూ పరిధిలోని కొత్తవలస-అరుకు రోడ్డు నుంచి దేశపాత్రునిపాలెం పంచాయతీ మంగళపాలెం జంక్షన్ సమీపంలోని మూడుగుల్ల పక్కన జనచైతన్య లే అవుట్ మీదుగా రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు చేయడం జరిగిందన్నారు. చింతలపాలెం రెవెన్యూకు చెందిన సర్వే 103లో నుంచి ఈ రోడ్డు ప్రతిపాదన ఉందని ఇందుకు సంబంధించి వీఎంఆర్డీఏ విడుదల చేసిన రోడ్డు మ్యాప్‌ను చూపించారు. ఈరోడ్డు నిర్మాణానికి సంబంధించి భూసేకరణ త్వరలోనే ఉంటాయని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అభ్యంతరాలు ఏమైనా ఉంటే తెలియ చేసుకోవచ్చన్నారు. భూములు కోల్పోయిన వారికి నష్ట పరిహారం చెల్లింపులపై అధికారులు చర్చించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు.

ధాన్యాన్ని కొనుగోలు చేయండి

రేగిడి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పొలాల్లో నిల్వ ఉంచిన ధాన్యాన్ని ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. జిల్లా రైతు సంఘం కార్యదర్శి నారు జనార్దనరావు, రైతు సంఘం మండల కార్యదర్శి పాలవలస రామినాయుడు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని సంకిలి, పుర్లి, కొమిర, ఖండ్యాం, వెంకటాపురం తదితర గ్రామాల్లో ఫిబ్రవరి వరకు పంటను నూర్చలేకపోయారన్నారు. ఆ రైతుల ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు.

28లోపు ఈకేవైసీ చేయించుకోండి

జామి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేషన్ లబ్ధిదారులు ఈనెల 28లోగా ఈకేవైసీ చేయించుకోవాలని సీఎస్ డీటీ మూర్తి తెలిపారు. మంగళవారం పలు గ్రామాల్లో వేలిముద్రలు పడని లబ్ధిదారులను గుర్తించి వారితో ఈకేవైసీ చేయించారు.

దుర్వాసన.. పొగ!

(ఐదో పేజీ తరువాయి)

ఉన్న మూడో వార్డు పరిధి వివేకానంద కాలనీ, పరిసర ప్రాంత వాసులు రోజూ నరకం చూస్తున్నారు. ఏటా వేసవిలో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగు తుండగా.. ఆ సమయంలో వచ్చే పొగతో వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

● మరోవైపు యార్డులో రోజు రోజుకూ పెరుగుతున్న వ్యర్థాలు, చెత్తలు వల్ల ఆ ప్రాంతానికి సమీపంలో ఉన్న గోపసాగరం కలుషితమవుతోంది. ఏళ్లుగా దానిపై ఆధారపడి బతుకుతున్న మత్స్యకారులకు ఏం చేయాలో తెలియడం లేదు. గత ఏడాది ఆగస్టులో సుమారు రూ.2 లక్షల విలువ చేసే చేపలు చనిపోయాయి. ఈ నేపథ్యంలో గోపసాగరాన్ని కలుషితం కాకుండా చూడాలని మత్స్యకార సంఘాలు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్న ఫలితం శూన్యం.

● గోపసాగరం కింద సుమారు ఎంద ఎకరాల్లో ఏటా వరి సాగవుతుంది. అయితే యార్డు కారణంగా నీరు కలుషితమవడంతో రైతులు కూడా తలలు పట్టుకుంటున్నారు. పొలాల్లోకి కలుషిత నీరు చేరడంతో కొన్నాళ్లుగా ఆశించిన స్థాయిలో పంట దిగుడులు రావడం లేదని ఆ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా చర్మవ్యాధులకు గురవుతున్నట్లు వాపోతున్నారు.

తరలింపుపై చర్చిస్తా

డంపింగ్ యార్డు తరలింపునకు సంబంధించి పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో చర్చిస్తాం. యార్డు నుంచి దుర్వాసన రాకుండా తడి, పొడి చెత్తలను వేరు చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తున్నాం. అంతే కాకుండా ఆ ప్రాంతంలో మంటలు, పొగలు రాకుండా , భూగర్భ జలాలు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటాం

- సీహెచ్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్, పార్వతీపురం

నరకం అనుభవిస్తున్నాం

డంపింగ్ యార్డు నుంచి వచ్చే దుర్వాసన, పొగలు వల్ల నరకాన్ని చూస్తున్నాం. యార్డు పక్క నుంచి వెళ్లాలంటే ముక్కులు మూసుకోవాల్సిన దుస్థితి. ప్రభుత్వాలు, అధికారులు మారుతున్నా.. సమస్య పరిష్కారం కావడం లేదు.

- ఎస్.లక్ష్మణ, పార్వతీపురం

కలుషితమవుతున్నా పట్టదా?

ఎన్నో ఏళ్లుగా గోపసాగరాన్ని నమ్ముకొని జీవిస్తున్నాం. డంపింగ్ యార్డు వల్ల అది కలుషితమవుతున్నా ఎవరూ పట్టించుకోక పోవడం బాధాకరం. ఎన్నో సార్లు మత్స్యకార, ఆయకట్టు సంఘాల ద్వారా అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతులు ఇచ్చినా చర్యలు శూన్యం.

- పి.శ్రీనివాసరావు, పార్వతీపురం

పూజారి ఆధ్వర్యంలోనే పారమ్మతల్లి జాతర

సాలూరు, ఫిబ్రవరి 25: మహాశివరాత్రి రోజున నిర్వహించే పారమ్మతల్లి జాతరను ఈ ఏడాది అమ్మవారి పూజారి చెల్లూరి సన్యాసి ఆధ్వర్యంలోనే నిర్వహిస్తామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పష్టం చేశారు. మంగళవారం ఆమె స్థానిక విలేకర్లతో ఫోన్‌లో మాట్లాడారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఈ జాతరను అస్సలు పట్టించుకోలేదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పారమ్మకొండకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.కోటీ60లక్షలు మంజూరు చేసి, త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసిందని తెలిపారు. ఈ జాతరను దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వమే పూజారి ద్వారా నిర్వహిస్తామని చెప్పారు. పూజారి ఆధ్వర్యంలోనే అధికారులు, నాయకులు పని చేస్తారని తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్నందున చైర్మన్‌ను తాము ప్రకటించలేక పోతున్నామని చెప్పారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. రానున్న కాలంలో ఓ గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా పారమ్మకొండను తీర్చి దిద్దబోతున్నట్టు ఆమె వెల్లడించారు.

పారమ్మకొండపై సెల్ఫీలు తీసుకోవద్దు

సాలూరు రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినం సందర్భంగా ఈనెల 26న పారమ్మకొండ ఎక్కే భక్తులు కొండపై సెల్ఫీలు తీసుకోవద్దని సాలూరు రూరల్ సీఐ పి.రామకృష్ణ కోరారు. ఆయన మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఎస్పీ మాధవరెడ్డి సూచన మేరకు ఏఎస్పీ అంకిత సురాన ఆధ్వర్యంలో 150 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పారమ్మకొండ ఎక్కి అమ్మవారి దర్శనం చేసుకుని పారమ్మ ఆశీస్సులు పొంది సురక్షితంగా ఇంటికి వెళ్లాలని కోరారు. కొండపై సెల్ఫీల సందడిలో ప్రమాదాలకు గురికావొద్దని సూచించారు. గతంలో కొండపై సెల్ఫీలు దిగుతూ ఒకరు ప్రాణాలు కోల్పోగా, మరి కొందరు గాయాలపాలైన ఘటనలు ఉన్నాయన్నారు. పారమ్మకొండ ఎక్కినప్పుడు, దిగినప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. అనారోగ్యంతో ఉన్న వారు కొండ ఎక్కకుండా ఉంటే మంచిదన్నారు.

పాలకొండలో రక్తదాన శిబిరం

పాలకొండ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పాలకొండ పట్టణంలోని తమ్మినాయుడు విద్యా సంస్థలో జాతీయ సేవా శిబిరం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. పాలకొండ ప్రభుత్వ ఆసుపత్రి, శ్రీకాకుళం రెడ్‌క్రాస్ వారు రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన రోగులకు రక్తం అందించడం అభినందనీయం అన్నారు. జిల్లా పశు సంవర్థకశాఖ అధికారి డాక్టర్ శివ్వాల మన్మథరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 126 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ చంద్రమౌళి, ఏడీలు మాణిక్యారావు, బి.శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ ఏ.తిరుపతిరావు, జి.అశోక్‌కుమార్, ఆర్ఫ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు ఎస్.సన్యాసిరావు, రెడ్ క్రాస్ ప్రతినిధులు, ఎన్ఎస్ఎస్ పీవోలు పాల్గొన్నారు.

పెదకోటిపల్లిలో యాత్రకు ఏర్పాట్లు

పాలకొండ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి సందర్భంగా పెద్దకోటిపల్లి గ్రామంలోని ఉమా కాత్యాయిని సహిత విశ్వేశ్వరస్వామి ఆలయ యాత్రా మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 26 నుంచి మార్చి 2వ తేదీ వరకు ఈ యాత్రా మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల్లో వాలీబాల్ పోటీలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాలకొండ పట్టణంలోని సనారీవిశ్వేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో రాత్రి సమయాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

ఘనంగా మెహర్‌బాబా జయంతి



మెహర్‌బాబా చిత్రపటాన్ని పల్లకిలో ఊరేగిస్తున్న దృశ్యం

పార్వతీపురంటౌన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మోహర్‌బాబా జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాతబస్టాండ్ కూడలి నుంచి బెలగాం మెహర్ బాబా మందిరం వరకు బాబావారి చిత్రపటాన్ని పల్లకిలో ఊరేగించారు. అనంతరం మెహర్ బాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు.

దివ్యాంగులకు పరికరాల పంపిణీ

ఒడిశా

రాయగడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాయగడ పురపాలక పరిధిలో స్థానిక అశోక్ కల్యాణ మండపంలో మంగళవారం భీమ్‌భోయి దివ్యాంగుల సాధికారిత ప్రచార శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 495 మంది దివ్యాంగులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. జిల్లా కేంద్రాసుపత్రి వైద్యుల బృందం దివ్యాంగుల ఆరోగ్య, శరీర పరిస్థితులను పరీక్షించింది. 56 మందికి దృష్టిలోపం, 62 మందికి చెవి, గొంతు వైకల్యం, 122 మందికి శారీరక వైకల్యం, 48 మందికి మానసిక వైకల్యం, 8మంది రక్తహీనత ఉన్నట్టు గుర్తించారు. వీరిలో కొందరికి వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, ఊతకర్రలు, వినికిడి యంత్రాలు అందజేశారు. పురాధ్యక్షుడు మహేష్ పట్నాయక్, పురపాలక కార్యనిర్వాహణాధికారి కులదీప్ కుమార్, డిప్యూటీ సాంఘిక సంక్షేమాధికారి శ్రీకాంత్ కుమార్ పాణిగ్రహి, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సమితి కార్యదర్శి అమరేంద్రనాథ్ పాల్గొన్నారు.

రోడ్డుపైనే వ్యాపారాలు

- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- నిర్వహణలోకి రాని మార్కెట్



జాతీయ రహదారిపై కూరగాయల అమ్మకాలు

గజపతినగరం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): స్థానిక జాతీయ రహదారిపై ఇరువైపులా రైతులు వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. స్థానికులు ఇక్కట్లకు గురవుతున్నారు. నియోజకవర్గ కేంద్రం, మండల కేంద్రం అయిన గజపతి నగరంలో వ్యాపారాలు సాగించుకునేందుకు చుట్టుపక్కల మండలాల నుంచి కూరగాయల రైతులు, వ్యాపారులు వస్తున్నారు. దీంతో స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. గజపతి నగరం నుంచి మెంటాడకు వెళ్లే రహదారిపైనే అమ్మకాలు చేపడుతున్నారు. అలాగే గజపతినగరం నుంచి విజయనగరం వైపు వెళ్లే జాతీయ రహదారిపై వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో వాహనదారులు ప్రతిరోజూ ఇక్కట్లకు గురవుతున్నారు.

ప్రారంభించారు కానీ.. అప్పగించలేదు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటీవలే నాబార్డు నిధులు రూ.15లక్షలు, పంచాయతీ నిధులు రూ.5లక్షల.. మొత్తం రూ.20లక్షలతో కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులు చేపట్టారు. దీనిని ఈ ఏడాది జనవరి 11న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు అయితే నేటికీ ఈ మార్కెట్‌ను చిరు వ్యాపారులకు అప్పగించలేదు. దీంతో వారు రోడ్డు పైనే అమ్మకాలు చేపడుతున్నారు.

ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలి

ఉదయం 7గంటల నుంచి 9 గంటల వరకు విద్యార్థుల కోసం పలు ప్రైవేటు విద్యాసంస్థల వాహనాలు రోడ్డుపైనే ఉంటాయి. దీనికి తోడు రోడ్డుపై వ్యాపారాలు.. దీంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. బీట్‌లో ఉన్న పోలీసు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో రోడ్డు పైన అమ్మకాలు రోజురోజుకు పెరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపైన అమ్మకాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని, అలాగే ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

పోలింగ్ నిర్వహణపై సమావేశం



అధికారులతో సమావేశమైన ఆర్డీవో రామ్మోహనరావు

బొబ్బిలి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఈనెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణపై స్థానిక ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావు మంగళవారం తన కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్ నిర్వహణ విధి విధానాలను కూలంకుషంగా వివరించారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో ఆయా మండల కేంద్రాలలో గల హైస్కూళ్లలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కేంద్రాలకు 40 మంది పోలింగ్ కోసం, 60 మంది మెటీరియల్ పంపిణీ కోసం ఎన్నికల సిబ్బందిని నియమించామన్నారు. వారంతా బుధవారం ఆర్డీవో కార్యాలయానికి వచ్చి తమ మెటీరియల్‌ను తీసుకెళతారని ఆర్డీవో వివరించారు. ఎక్కడా నిబంధనలకు విరుద్ధంగా పోలింగ్ నిర్వహించరాదని, ఏవైనా సందేహాలు, సమస్యలుంటే వాటిని ఉన్నతాధికారుల ద్వారా నివృత్తి చేసుకోవాలని ఆర్డీవో తెలిపారు.

బొబ్బిలి డివిజన్‌లో 1064 ఓటర్లు

బొబ్బిలి రెవెన్యూ డివిజన్ పరిధిలో గల బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి, తెర్లాం, దత్తిరాజేరు, మెంటాడ, గజపతినగరం మండలాల పరిధిలో మొత్తం 1064 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. వారిలో 759 మంది పురుషులు, 305 మంది మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవోలు రవికుమార్, శంబంగి రామకృష్ణ, రాంబాబు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ బలివాడ గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రఘువర్మను గెలిపించండి





బెలగాం: ప్రచారం నిర్వహిస్తున్న పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర, పాలకొండలో ఎమ్మెల్యే జయకృష్ణ..

బెలగాం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఉపాధ్యాయులను కోరారు. మంగళవారం స్థానిక భాస్కర్ కళాశాలలో ఆయన ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● పాలకొండ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కూటమి అభ్యర్థి పాకలపాటి రఘువర్మను ఎమ్మెల్సీగా గెలిపించాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కోరారు. ఈ మేరకు మంగళవారం వివిధ పాఠశాలల ఉపాధ్యాయులను ఆయన నేరుగా కలిసి కరపత్రాలు అందించారు. ఈ ప్రచారంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష హోదా కోసం మాట్లాడడం సబబు కాదు

అనంతరం ఆయన విలేకర్లతో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ప్రజా సమస్యలపై మాట్లాడమంటే.. ప్రతిపక్ష నాయకుడి హోదా కోసం మాట్లాడడం వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి సబబు కాదన్నారు. 15 నిమిషాలు కూడా అసెంబ్లీలో ఉండకపోవడం దారుణమన్నారు.

శివ జయంతి మహోత్సవాలను విజయవంతం చేయాలి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న బ్రహ్మకుమారీ జ్ఞానరత్నం

పార్వతీపురంటౌన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సౌందర్య నారాయణమూర్తి నగర్‌లో జరిగే శివ జయంతి మహోత్సవాలను విజయవంతం చేయాలని బ్రహ్మకుమారీ జ్ఞాన రత్నం కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఓం శాంతి మందిరంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా 26వ తేదీన సౌందర్య నారాయణమూర్తి నగర్‌లో నూతనంగా నిర్మించనున్న ఓంశాంతి భవన స్థలంలో మహా శివలింగ దర్శనం కోసం ఏర్పాటు చేశామని చెప్పారు. 27న ఉచిత వైద్య శిబిరం, 28న ఓం శాంతి పరివార యోగధ్యాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే శివ జయంతి మహోత్సవాల్లో పట్టణంలో ప్రతిఒక్కరూ పాల్గొన్నాలని పిలుపునిచ్చారు.

నెలాఖరులోగా ధ్రువపత్రాలు ఇవ్వాలి



గిరిజనులతో మాట్లాడుతున్న ఏఈ ఉమామహేశ్వరరావు

జియ్యమ్మవలస, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తగా ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకునే ప్రతిఒక్కరూ తప్పకుండా కుల, ఆదాయ, పొజిషన్ సర్టిఫికేట్లు సంబంధిత సచివాలయంలో ఇవ్వాలని మండల గృహ నిర్మాణ శాఖ ఏఈ ఎల్.ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన కొండచిలకాం గ్రామంలో గిరిజనులతో మాట్లాడారు. మండలంలో కొత్తగా ఇళ్లు కావల్సిన వారు 2,163 మంది ఉన్నారన్నారు. ఈ నెలాఖరులోగా సంబంధిత ధ్రువపత్రాలు ఇవ్వాలన్నారు. అలాగే గతంలో ఇళ్లు మంజూరై ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించిన ప్రతి లబ్ధిదారుడు మార్చి 31లోగా పూర్తి చేయాలని కోరారు. పీఎం జన్మాన్ పథకంలో 217 ఇళ్లకు గాను రెండు మాత్రమే పూర్తయ్యాయని అన్నారు. ఈయన వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ ఉన్నారు.

జ్ఞానజ్యోతి శిక్షణను వినియోగించుకోండి

గుమ్మలక్ష్మీపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలు జ్ఞానజ్యోతి శిక్షణా కార్య క్రమంలో నేర్చుకున్న అంశాలను చిన్నారులకు చక్కగా అందించి వారి పురోగతిని కాంక్షించాలని ఎంపీడీవో సాల్మన్‌రాజు, ఎంఈవో బి.చంద్రశేఖర్, ఇన్‌చార్జి సీడీపీవో రాజ్యలక్ష్మి కోరారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ విద్యా విధానం2020లో భాగంగా అంగన్వాడీ వర్కర్లకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణా కార్య క్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా సూక్ష్మ కండరాలు, స్థూల కండరాలు అభివృద్ధికి సంబంధించిన అంగన్‌వాడీ సిబ్బంది తయారీ చేసిన చార్టులను పరిశీలించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీదేవి, రేవతి, దౌలత్ వున్నీసా, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం

- ఎస్పీ మాధవరెడ్డి



బాధిత కుటుంబాలకు చెక్కును అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు మృతిచెందిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎస్పీ కార్యాలయం లో బాధిత కుటుంబాలకు మంజూరైన ఇన్సూరెన్స్ చెక్‌ను ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బందికి ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే ఆదుకునేందుకు వారి వేతనాలను శాలరీ ప్యాకేజీ స్కీంగా బ్యాంకు ఖాతాలో జమయ్యేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. జిల్లాలోని ఏఆర్ విభాగంలో పని చేస్తున్న కానిస్టేబుల్ బుల్లిబాబు రోడ్డు ప్రమాదంలో మరణించగా రూ.68లక్షల ఇన్సూరెన్స్ ఏక్సిస్ బ్యాంక్ మంజూరు చేసిందన్నారు. తొలి విడతగా మంజూరు చేసిన రూ.38 లక్షల చెక్కును బాధిత కుటుంబానికి అందజేశామని చెప్పారు. అలాగే అనారోగ్యంతో మృతిచెందిన ఏఆర్ కానిస్టేబుల్ పోలిరాజు కుటుంబానికి రూ.25వేల చెక్కును అందజేశారు. ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, ఏఆర్ ఆర్ఐలు నాయుడు, రాంబాబు, ఏక్సిస్ బ్యాంక్ బ్యాంక్ డిప్యూటీ మేనేజర్ నాగేంద్ర పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏటీడబ్ల్యూవో చంద్రబాబు

జియ్యమ్మవలస, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు అవసరమైన తర్ఫీదు ఇవ్వాలని ఏటీడబ్ల్యూవో కె.చంద్రబాబు ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం ఆయన వనజ, జియ్యమ్మవలసలలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ముందుగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి వారికి వివిధ సబ్జెక్టుల్లో ఉన్న విద్యా ప్రమాణాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే వెనుకబడిన విద్యార్థుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. తర్వాత ఉపాధ్యాయులతో సమావేశమై పాఠశాల అభివృద్ధి, విద్యాభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. టీచింగ్ డైరీ, లెసన్ ప్లాన్, డైలీ టెస్ట్, గ్రాండ్ టెస్ట్‌లను పరిశీలించారు. వేడి గాలులు ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల డైట్ పట్ల తగు చర్యలు తీసుకోవాలని వార్డెన్ హిమరిక సత్యంను ఆదేశించారు.

న్యూస్ బాక్స్

ఆశ్రమ పాఠశాల తనిఖీ

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలోని స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమం బాలికల ఉన్నత పాఠశాలను పార్వతీపురం మన్యం డీడీ కృష్ణవేణి తనిఖీ చేశారు. విద్యార్థినులకు అందిస్తున్న మెనూ పరిశీలించారు. మెనూ అమలు తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. రికార్డులు పరిశీలించారు. ఈ పరిశీలనలో డీడీతో పాటు హెచ్ఎం వసంత లక్ష్మి, హెచ్‌డబ్ల్యూవో పి.అమల ఉన్నారు.

ఇకపై డ్రోన్‌తో నిఘా

వీరఘట్టం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల ప్రాంతాల్లో సారా తయారీదారులను గుర్తించేందుకు డ్రోన్‌తో నిఘా ఏర్పాటు చేస్తున్నామని ఎస్ఐ జి.కళానిధి తెలిపారు. మంగళవారం చిట్టిపుడివలస గ్రామంలో డ్రోన్‌తో ఆయా ప్రాంతాలను పరిశీలించారు. డ్రోన్ సాయంతో జాతరలు, ముఖ్య నాయకుల సమావేశాల సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడవచ్చునని చెప్పారు.

జాబ్‌మేళాకు 50 మంది హాజరు

సీతంపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో మంగళవారం సీతంపేట వైటీసీలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు 50 అభ్యర్థులు హాజరయ్యారు. వీరికి కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 35 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన వారు నెల్లూరు, హైదరాబాద్ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్కిల్ కాలేజ్ కో-ఆర్డినేటర్ వెంకటరమణ, కంపెనీల హెచ్ఆర్‌లు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

సీతానగరం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మంగళవారం సందర్శించారు. అక్కడి ఏర్పాట్లపై స్థానిక తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన సూచించారు. ఆయన వెంట పలువురు అధికారులు ఉన్నారు.

అర్థమయ్యే రీతిలో బోధించాలి

గరుగుబిల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని చిన్నారులకు అర్థమయ్యే రీతిలో బోధన నిర్వహించాలని ఎంఈవో డి.అప్పలనాయుడు సూచించారు. మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా అందిస్తున్న శిక్షణను కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఈవో-2 కె.కొండలరావు, సీహెచ్ చిరంజీవినాయుడు, రిసోర్స్‌పర్సన్లు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి నిల్వలను పెంచేందుకు చర్యలు

గరుగుబిల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నీటి నిల్వలను పెంచేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. మంగళవారం మండలంలోని పెద్దూరు, గరుగుబిల్లి, బీపీపురం పంచాయతీల పరిధిలో ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో రైతులకు అవసరమైన పనులకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. పంట పొలాల్లో, పండ్ల తోటల్లో ఫారం పాండ్స్ నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ పరిశీలనలో ఏపీవో ఎం.గౌరీనాథ్, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీవిద్య, తదితరులు ఉన్నారు.

జీబీఎస్‌పై అవగాహన అవసరం

బాడంగి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఇటీవల సంభవిస్తున్న గులియన్‌బారి సిండ్రోం వ్యాధిపై ప్రజలకు అవగాహన అవసరమని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈ అరుదైన నాడీ సంబంధిత వ్యాధి శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థ, నరాలపై దాడి చేస్తుందని తెలిపారు. దీని కారణంగా కాళ్లు, చేతులు బలహీనపడడం, చలనం తగ్గిపోవడం, కొన్నిసార్లు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు కలుగుతాయన్నారు. ఈ లక్షణాలతో బాధపడేవారు స్థానిక వైద్యులను సంప్రదించాలని ఆయన సూచించారు. కలుషితమైన ఆహారం, నీరు తాగడం వల్ల ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే దీని ప్రభావాన్ని తగ్గించుకోవచ్చని ఆయన చెప్పారు.